క్లుప్తంగా

పనులు పూర్తి చేయాలి



భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న, మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్

నర్సాపూర్: మున్సిపాలిటీ కార్యాలయ భవనం నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని పలువురు ప్రజాప్రతినిధులు కాంట్రాక్టర్‌కు సూచించారు. మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు సురేష్, రాంచందర్, బీఆర్‌ఎస్ కాంగ్రెస్ నాయకులు పంబాల భిక్షపతి, దావూద్, ఆంజనేయులుగౌడ్ తదితరులు నిర్మాణ పనులు పరిశీలించారు. నాణ్యత పాటిస్తూ త్వరలో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్ నవీన్‌రావుకు సూచించారు.

కల్వర్టుపై స్లాబ్ పూర్తి



మురికికాల్వపై స్లాబ్ పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ సిబ్బంది

నర్సాపూర్: ప్రజల సౌకర్యార్థం తమ వార్డులోని మురికి కాల్వపై స్లాబ్ పూర్తి చేయించినట్లు నర్సాపూర్ మున్సిపాలిటీ రెండో వార్డు కౌన్సిలర్ లత చెప్పారు. తమ వార్డులోని ఓ మురికి కాల్వపై స్లాబ్ లేక ప్రజలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఇబ్బందులు పరిష్కరించేందుకు మురికి కాల్వపై స్లాబ్ వేయించినట్లు ఆమె తెలిపారు. ఆదివారం స్లాబ్ పనులు పూర్తయ్యాయని ఆమె తెలిపారు.

దాడి చేయడం సరికాదు

రామాయంపేట(మెదక్): మున్సిపాలిటీ కౌన్సిలర్, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు నాగరాజుపై కాంగ్రెస్ కార్యకర్త దాడి చేయడం సరికాదని నార్సింగి బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మైలారం బాబు పేర్కొన్నారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ.. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఏ ఒక్క రోజూ ఇతర పార్టీలవారిపై దాడులు జరుగలేదన్నారు.

క్రికెట్ టోర్నమెంట్



విజేతలకు బహుమతి అందిస్తున్న నిర్వాహకులు

పాపన్నపేట(మెదక్): మండల పరిధిలోని ఎల్లాపూర్‌లో ఆదివారం దుర్గాగౌడ్, రాజాగౌడ్, జనార్దన్ స్మారక క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఇండియన్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నీలో నాలుగు టీంలు పాల్గొన్నాయి. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో చాకలి ప్రవీణ్ జట్టు విజయం సాధించింది. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. గ్రామపెద్దలు, యువకులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

చిన్నశంకరంపేట(మెదక్): బీఆర్‌ఎస్ కార్యకర్తలు అధైర్యపడొద్దని, వారికి అండగా ఉంటామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని రుద్రారం గ్రామ మాజీ సర్పంచ్ లక్ష్మణ్ తల్లి రాజమ్మ ప్రథమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజు, తాజామాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, యాదగిరి, ప్రసాద్, శ్రీనివాస్, ప్రభాకర్, భిక్షపతి, నరేష్, రాజు, మహేశ్ తదితరులున్నారు.
మండలంలోని కొర్విపల్లి గ్రామ మాజీ సర్పంచ్ సక్రూనాయక్ మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీ ప్రసాద్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

పరామర్శ

కౌడిపల్లి(నర్సాపూర్): విందులో తిన్న ఆహారం వికటించి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన బాధిత కుటుంబాన్ని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ఆదివారం పరామర్శించారు. నర్సాపూర్ మండలంలోని జానకంపేట తండాలో వారం రోజుల క్రితం జరిగిన విందులో మండలంలోని లింగంపల్లితండాకు చెందిన ముడేరి ముత్యాలి (45) పాల్గొన్నారు. ఇంటికి వచ్చిన తర్వాత ఆమెకు పిల్లలకు వాంతులు, విరోచనాలు కాగా మెదక్ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆదివారం ఈ విషయం తెలియడంతో నర్సాపూర్ ఆస్పత్రి వద్ద ఎమ్మెల్యే మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట తునికి, నాగ్సాన్‌పల్లి మాజీ సర్పంచ్‌లు అమర్ సింగ్, ఎల్లం ఉన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి లింగంపల్లిలో మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలిపారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

మండుటెండల్లో నిరీక్షణ

- ప్రయాణికులకు తప్పని తిప్పలు
- మేజర్ గ్రామాల్లో బస్టాండ్లు.. బస్ షెల్టర్లు లేక ఇక్కట్లు
- మండల కేంద్రంలో ఆదే పరిస్థితి



చిట్కుల్‌లో ఎండలోనే బస్సుల కోసం ఎదురుచూస్తున్న ప్రయాణికులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): పలు గ్రామాల్లో ప్రయాణికులు బస్సులు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నారు. చిలప్‌చెడ్ మండలంగా ఏర్పాటై ఏడేళ్లు గడుస్తున్నా.. మండల కేంద్రంతో సహ గ్రామాల్లో కనీస మౌలిక సదుపాయాలు కూడా లేకపోవడంతో ప్రజలు అవస్థలకు గురవుతున్నారు. మండలంలో 19 గ్రామ పంచాయతీలు ఉన్నప్పటికీ కేవలం నాలుగు గ్రామాల గేట్ల వద్ద మాత్రమే బస్‌షెల్టర్ సౌకర్యాలు ఉన్నాయి. చిలప్‌చెడ్ మండలంలో చండూర్, శీలాంపల్లి, ఫైజాబాద్, చాముండేశ్వరి గేట్‌ల వద్ద మాత్రమే బస్‌షెల్టర్ సౌకర్యాలు ఉన్నాయి. చిట్కుల్ చౌరస్తా వద్ద ఓ దాత సహకారం అందించి, షెల్టర్ ఏర్పాటు చేశాడు. అయినప్పటికీ ఆ షెల్టర్‌ను అధికారులు, నాయకులు పట్టించుకోకపోవడంతో విద్యుత్ సౌకర్యం లేక రాత్రి సమయాల్లో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు.

జాగారం చేయాల్సిందే

చిలప్‌చెడ్ మండలంగా ఏర్పాటై ఏడేళ్లు పూర్తయిన గ్రామంలో బస్‌షెల్టర్ సౌకర్యం లేదు. నిత్యం మండల కేంద్రానికి పలు పనుల నిమిత్తం ఆయా గ్రామాల నుంచి ఎంతో మంది జనాలు వస్తున్నప్పటికీ, వారు రవాణా సౌకర్యాల కోసం, చెట్లు, దుకాణాలు, హోటల్స్‌లో జాగారం చేయాల్సిందే. మండల కార్యాలయాలకు వస్తున్న మహిళలు, వృద్ధుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది.

సరైన సౌకర్యాలు లేవు

చిలప్‌చెడ్ మండలం మీదుగా జోగిపేట – నర్సాపూర్, జోగిపేట్ – మెదక్ ప్రధాన రహదారులు ఉన్నాయి. ప్రధాన రహదారి పక్కనే చిట్కుల్ మేజర్ గ్రామం ఉండగా, బస్టాండ్ లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. గౌతాపూర్ గేటు వద్ద బస్టాండ్ లేక ప్రయాణికులు బస్సుల కోసం ఎండలో ఎదురు చూడాల్సి వస్తుంది. మహిళలు, చిన్నారులు, వృద్ధులు సరైన సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అదేవిధంగా మండలంలోని పలు గ్రామాల్లో బస్టాండ్లు లేవు. తండాల పరిస్థితి మరీ దారుణం.

బస్సులేదు.. బస్టాండ్ లేదు



గతంలో సోమక్కపేట్ గ్రామం మీదుగా బస్సు సౌకర్యం ఉండేది. దీంతో విద్యార్థులకైనా కాస్త ఊరట ఉండేది. ప్రస్తుతం మా గ్రామానికి బస్సు రావడం లేదు. బస్‌షెల్టర్ ఊసే లేదు. గ్రామం నుంచి ఎవరైనా మరో గ్రామానికి వెళ్లాలంటే సోమక్కపేట్ గేటు వరకు నడవాల్సిందే. కనీసం మా గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించండి.

– రాజు, సోమక్కపేట్

చెట్ల కింద ఎదురు చూపులు



చిట్కుల్ గ్రామంలో బస్‌షెల్టర్ లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రయాణికులు బస్సుల కోసం, చెట్ల నీడకు, దుకాణాల వద్ద జాగారం చేస్తున్నారు. ఎండకాలం పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. మండలం ఏర్పాటయ్యాక కూడా కనీసం ప్రయాణికులు సౌకర్యాలు కూడా కల్పించకపోవడం సరికాదు. ఈ సమస్య పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– సుధాకర్, చిట్కుల్

వైభవంగా బోనాల ఊరేగింపు



బోనాల ఊరేగింపులో భక్తులు

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లిలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఉత్సవాలు ఆలయ కమిటీ చైర్మన్ బస్వరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం గ్రామదేవతలైన దుర్గమ్మ, పోచమ్మలకు బోనాలను అంగరంగా వైభవంగా ఊరేగించారు. శివసత్తువుల వేషాధారణలో డప్పు చప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ అమ్మవార్లకు బోనాలను ఊరేగించారు. మహిళలు అధిక సంఖ్యలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనడంతో ఆలయ ప్రాగణమంతా కిటకిటలాడింది. వచ్చిన భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను అందించారు. ఇందులో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా బోనాల ఊరేగింపు

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేట శివారులోని గంగమ్మ ఆలయానికి మహిళలు భక్తి శ్రద్ధలతో బోనాలను సమర్పించారు. ఆదివారం సాయంత్రం స్థానిక దుర్గమ్మ ఆలయం నుంచి భాజాభజంత్రీల మధ్య ఊరేగింపుగా తరలివెళ్లి బోనాలను సమర్పించారు.

29 నుంచి మానిక్‌ప్రభు జాతర

పెద్దశంకరంపేట(మెదక్): మండల పరిధిలోని మక్త లక్ష్మాపూర్ గ్రామంలోని శ్రీ మానిక్ ప్రభు 32వ వార్షికోత్సవాలను ఈ నెల 29 నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. బుధవారం స్వామి వారికి అభిషేకాలు, బోనాలు, 30న బండ్ల ఊరేగింపు, రాత్రి సూర్యచంద్రుల నాటకం, 31న కుస్తీ పోటీలు, అన్నదానం, జూన్ 1న మానిక్‌ప్రభు పల్లకీసేవ, 2న పాచి బండ్ల ఊరేగింపు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో హాజరుకావాలన్నారు.

ఆ ఘటనతో కాంగ్రెస్‌కు సంబంధం లేదు

- పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు



మాట్లాడుతున్న పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు

రామాయంపేట(మెదక్): కాంగ్రెస్ కార్యకర్తలు అధిష్టాన వర్గానికి సమాచారం లేకుండా ఎలాంటి భూదందాలకు, అవాంఛనీయ సంఘటనలకు, పంచాయతీలకు పాల్పడొద్దని పీసీసీ కార్యదర్శి సుప్రభాతరావు హెచ్చరించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడిపై కాంగ్రెస్ కార్యకర్త పోచమ్మల గణేశ్ పెట్రోల్ పోసి హత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటతో కాంగ్రెస్‌కు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఏదైనా సమస్య ఉంటే చట్టప్రకారం చర్చించుకొని పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ చిలుక గంగాధర్, పార్టీ బీసీ సెల్ జిల్లా కన్వీనర్ విప్లవ్‌కుమార్, ఇతర నాయకులు ఎనిశెట్టి సంతోష్, తోట కిరణ్, అశోక్, దోమకొండ యాదగిరి, స్వామి, బైరం కుమార్, వినయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



కౌడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మను దర్శించుకుంటున్న భక్తులు



చిలప్‌చెడ్(నర్సాపూర్): ఆలయంలో అమ్మవార్లను దర్శించుకుంటున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): తునికి నల్లపోచమ్మదేవి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు శివప్ప, రాజేశ్ అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని బోనాలు తీసి ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద డప్పు చప్పుడు శివసత్తుల పూనకాలతో అమ్మవారి స్మరణతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించడంతో పాటు వాహనాలకు పూజలు చేయించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

చాముండేశ్వరి ఆలయంలో..

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మవారితో పాటు ఆలయంలోని బ్రహ్మి, కాళి, వైష్ణవి అమ్మవార్లను దర్శించుకొని, మొక్కులు సమర్పించుకున్నారని ఆలయ అర్చకులు తెలిపారు. ఆదివారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కార్యక్రమంలో భాగంగా అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించామన్నారు. భక్తులు అమ్మవారికి ప్రదక్షిణలు చేసి, ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు వితరణ చేశామన్నారు.

గ్రామ దేవతల ఆలయాల వార్షికోత్సవాలు



గణపతి హోమం నిర్వహిస్తున్న పండితులు

నర్సాపూర్ రూరల్: మండలంలోని రుస్తుంపేటలో వెలిసిన శ్రీ సంతాన నాగదేవత, పోచమ్మ దేవత ఆలయాల ఆరవ వార్షికోత్సవ పూజలు ఆలయ ఫౌండర్ డాక్టర్ దండేపు బస్వానందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గణపతి పూజ, గ్రామ దేవతలకు అభిషేకం, శివుడికి రుద్రాభిషేకం, నవగ్రహ పూజ, గణపతి హోమం పైతార ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదం, సాయంత్రం వరకు భక్తి భజన, సంస్కతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఇష్టపూర్వకంగానే విక్రయించాం

- శివ్వంపేట రైతులు



శివ్వంపేటలో మాట్లాడుతున్న రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): పలువురు వ్యాపారులకు ధాన్యం మా ఇష్టపూర్వకంగా విక్రయించామని రైతులు అన్నారు. శివ్వంపేటలో ఆదివారం వారు మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాల్లో రోజుల తరబడి ఎదుర్కొంటున్న ఇబ్బందుల దృష్ట్యా వ్యాపారులకు ఎలాంటి తరుగు, హమాలి, రవాణా, ఇతర ఖర్చులు లేకుండా ధాన్యం క్వింటాలకు రూ.2150 నగదుకు విక్రయించామని రైతులు మల్లేశ్, కిషన్, బ్యాగరి రాములు, అంజి, కుమ్మరి రవి, తదితరులు తెలిపారు. కొందరు వ్యక్తులు పనికట్టుకొని ధాన్యం కొంటున్న వ్యాపారులపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని వాపోయారు. ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి మాకు లేదన్నారు.

ఈదురుగాలులకు ఎగిరిపోయిన రేకులు



భీంనగర్ తండాలో ఎగిరిపోయిన ఇంటి రేకులు



పొలాల్లో పడిన రేకులు

చేగుంట(తూప్రాన్): ఈదురు గాలులతో ఇంటి రేకుల కప్పులు ఎగిరిపోయిన సంఘటన మండలంలోని కరీంనగర్ గ్రామ పంచాయతీ భీంనగర్ తండాలో ఆదివారం చోటు చేసుకుంది. తండాకు చెందిన సుక్రు అనిత రేకుల ఇంటి రేకులు బలమైన ఈదురు గాలులతో ఎగిరిపోయి సమీప పొలాల్లో పడిపోయాయి. దాదాపు 50వేల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితురాలు తెలిపారు. ప్రభుత్వం పరిహారం అందించాలని బాధితురాలు కోరారు.

బంగారమ్మా.. దీవించమ్మా



మనోహరాబాద్(తూప్రాన్): కాలకంఠి బంగారమ్మ వద్ద భక్తులు

మనోహరాబాద్(తూప్రాన్): బంగారమ్మా చల్లగా దీవించమ్మా అంటూ పలు గ్రామాల భక్తులు కాలకంఠి బంగారమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. మనోహరాబాద్ మండలంలోని కాళ్లకల్ గ్రామ శివారులోని బంగారమ్మ అమ్మవారిని పలు గ్రామాల భక్తులు దర్శించుకొని తమ మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం వనభోజనాలు చేశారు.

ఇన్సురెన్స్ చెక్కు అందజేత



చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్: పార్టీ కార్యకర్త చనిపోవడంతో ఆయన కుటుంబానికి పార్టీ నుంచి వచ్చిన చెక్కును ఆదివారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కౌడిపల్లి మండలంలోని నాగ్సాన్‌పల్లికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్త అల్మాయిపేట అంజయ్య ఇటీవల చనిపోయాడు. దీంతో ఆయన కుటుంబానికి పార్టీ నుంచి రూ.2లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్టీ అండగా ఉంటుందని చెప్పారు. చెక్కు పంపిణీలో పార్టీ నాయకులు సత్యంగౌడ్, అమర్‌సింగ్, షేక్ హుస్సేన్, సూరారంనర్సింలు, సుధాకర్‌రెడ్డి, శ్రీశైలంయాదవ్, ఎల్లమయ్య, ప్రసాద్, సాయాగౌడ్ తదితరులు ఉన్నారు.

గ్రామానికే వన్నె తెచ్చిన చావడీలు

గ్రామస్తులు సేద తీరేందుకు అనుకూలం



కొత్తపేట చావడీలో సేద తీరుతున్న గ్రామస్తులు

శివ్వంపేట(నర్సాపూర్): ఎన్నో ఏళ్ల క్రితం పలు గ్రామాల్లో నిర్మించిన చావడీలు.. ఆ గ్రామాలకు వన్నె తెస్తున్నాయి. గ్రామస్తులు సేద తీరేందుకు గ్రామ మధ్యలో నిర్మించిన చావడీలు ఇప్పటికీ ప్రజలకు సౌకర్యవంతగా ఉన్నాయి. పిల్లుట్ల, కొత్తపేట గ్రామాల్లో నిర్మించిన చావడీల వద్ద నిత్యం గ్రామస్తులు కూర్చుని కబుర్లు చెప్పుకుంటారు. కొత్తపేటలో పురాతన చావడీ శిథిలావస్థకు చేరడంతో మరమ్మతులు చేశారు.

తాళ్లపల్లితండాలో నల్లపోచమ్మ ఉత్సవాలు



నల్లపోచమ్మ ఉత్సవాల్లో నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని తాళ్లపల్లితండాలో ఆదివారం నల్లపోచమ్మ ఉత్సవాలు తండావాసులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏటా ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు బోనాలు, బండ్లు ఊరేగించారు. వివిధ తండాల వాసులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో కాంగ్రెస్ నాయకులు ఆవుల రాజిరెడ్డి, ఆంజనేయులుగౌడ్, సుహాసినిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, వెంకట్‌రామిరెడ్డి, నవీన్‌గుప్తా, బండారి గంగాధర్, వేణుగోపాల్‌రెడ్డి, తిరుపతిరాథోడ్, గెమ్‌సింగ్, గన్యానాయక్, తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1993 – 94 పదో తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వివిధ విభాగాల్లో స్థిరపడిన అప్పటి విద్యార్థులంతా ఒక్కచోట చేరి విద్యార్థి దశలోని మధుర స్మృతులను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సత్కరించి మెమొంటోలు అందజేశారు.

కొల్చారంలో..

కొల్చారం(నర్సాపూర్): రంగంపేట ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ స్నేహితుల ఆత్మీయ సమ్మేళనం మండలంలోని చిన్నఘనాపూర్ శివారు ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించారు. మండలంలో, ఇతర ప్రాంతాల్లో స్థిరపడి ఆయా రంగాల్లో పనిచేస్తున్న స్నేహితులంతా కలిసి మధుర స్మృతులను ఒకరికొకరు పంచుకున్నారు.



కొల్చారం(నర్సాపూర్): పూర్వ స్నేహితులు

రేపు శ్రీనివాసుడి కల్యాణోత్సవం



వేడుకలకు ముస్తాబవుతున్న వేంకటాద్రి

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని సంగాయిపేట గ్రామంలోని వేంకటాద్రి పై వెలసిన లక్ష్మీ శ్రీనివాసుడి కల్యాణోత్సవం వేడుకలు ఈనెల 28న ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. వేడుకల్లో భాగంగా స్వామివారికి మంజీరా జలాలతో అభిషేకం, అలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. వేడుకలు రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి శ్రీ మాధవానంద స్వామి పర్యవేక్షణలో జరుగనున్నాయి. దాతల సహకారంతో అన్నదానం ఏర్పాటు చేస్తామని ఉత్సవ నిర్వాకులు తెలిపారు.